జవహర్‌నగర్‌ను పరిశుభ్రంగా తీర్చిదిద్దుతాం



జవహర్‌నగర్‌లో శానిటేషన్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న శానిటేషన్ పనులను శుక్రవారం కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు తమ ఇంట్లో చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయరాదని, ఇంటికి వచ్చే ఆటోరిక్షాలోనే తడి, పొడి చెత్తను వేరు చేసి వేయాలన్నారు. పరిశుభ్రమైన నగరంగా జవహర్‌నగర్‌ను తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధ్వజ శిఖర ప్రతిష్ఠ పూజలు



విగ్రహ ప్రతిష్ఠ పూజలో కౌన్సిలర్ సంగీతప్రభాకర్‌రెడ్డి దంపతులు

ఘట్‌కేసర్: బొక్కొనిగూడలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయ స్వామి ఆలయంలో అభయాంజనేయ స్వామి, నవగ్రహ, ధ్వజ శిఖర ప్రతిష్ఠ పూజలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంటప దేవత పూజలు, స్థాపిక దేవతాపూజలు, కలశ స్నపనం, మంత్రపుష్పం తదితర పూజలు నిర్వహించారు. స్థానిక కౌన్సిలర్ సంగీత ప్రభాకర్‌రెడ్డి దంపతులు, మాజీ వార్డు సభ్యుడు జంగారెడ్డి దంపతులు, స్థానిక నాయకుడు జంగారెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.

బీజేపీలో చేరికలు



బీజేపీలో చేరుతున్న వారికి కండువాలు కప్పుతున్న విక్రంరెడ్డి

మేడ్చల్: మండలంలోని బండమాదారం ప్రాంతానికి చెందిన వివిధ పార్టీల, యువజన సంఘాలకు చెందిన యువకులు, నాయకులు బీజేపీలో చేరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి సమక్షంలో వారు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, నాయకులు జగన్‌గౌడ్, దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కెమికల్ వ్యర్థాలు రాకుండా చర్యలు తీసుకోండి

ఉప్పల్: ఉప్పల్ డివిజన్ పరిధిలోని పారిశ్రామికవాడ శ్రీరమణపురంలో స్థానిక సమస్యలపై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పర్యటించారు. స్థానికులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. కొద్ది రోజులుగా ఉప్పల్ పారిశ్రామికవాడ నుంచి వచ్చే కెమికల్ వ్యర్థాలు పైపులైన్ పగిలి కాలనీల్లోకి వస్తున్నాయని, దీనివల్ల స్థానికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. దీంతో ఎమ్మెల్యే స్పందించి అధికారులతో మాట్లాడారు. త్వరలో కెమికల్ వ్యర్థాలు రాకుండా అన్ని చర్యలు తీసుకోనున్నట్లు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే సత్వరమే స్పందించడంతో కాలనీ జనరల్ సెక్రటరీ జి.బి. సాయి, రత్నాకర్, కాలనీ గౌరవ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం



ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో శుక్రవారం సెలవు దినం కావడంతో పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి సంగీత నృత్యానికేతన్ గురువు యచ్యుతాంబ శిష్యబృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. రంగపూజ, మూషిక వాహన, గణేశాస్తుతి, రామాయణ శబ్దం, మోహిని భస్మాసుర, స్వాగతం కృష్ణ అంశాలను వైష్ణవి, నవ్య, శ్రేయ, అనఘా, చిన్మయి, గౌతమి, ప్రాంజల్‌లు ప్రదర్శించి మెప్పించారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

ఉప్పల్: గుర్తు తెలియని యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్ కూరగాయల మార్కెట్ వద్ద ఈ నెల 21న గుర్తు తెలియని యువకుడు(25) అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు యువకుడిని చికిత్స నిమిత్తం గాంధీకి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

వ్యక్తి అదృశ్యం



శివప్రసాద్ (ఫైల్)

జవహర్‌నగర్: వ్యక్తి అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ కేపీఎ ల్‌కాలనీలో నివసించే పల్లెబోయిన శివప్రసాద్(35), భార్య పుష్పతో కలిసి ఉంటున్నారు. శివప్రసాద్ పంజాగుట్టలోని ఓ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. ఈ నెల 27వ తేదీన పనికి వెళ్తున్నానని చెప్పి ఇంటికి తిరిగిరాలేదు. దీంతో అతడి ఆచూకీ కోసం తెలిసిన చోటల్లా వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అవినీతిమయంగా.. మేడ్చల్ మున్సిపాలిటీ

వెలుగుచూసిన రూ.25 లక్షల కుంభకోణం

- అంతా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులమయం
- అవుట్ సోర్సింగ్ ఉద్యోగిపై కేసు నమోదు
- ప్రభుత్వ ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలకు సిద్ధం



మేడ్చల్: జిల్లాలోనే పెద్ద మున్సిపాలిటీలలో ఒకటైన మేడ్చల్ మున్సిపాలిటీ అవినీతిమయంగా తయారైంది. ఆడిట్ అధికారులు నెల రోజుల పాటు శ్రమించి లెక్కలు తీయడంతో రూ.25 లక్షల అవినీతి బయట పడింది. కేవలం ఒక విభాగంలో చోటు చేసుకున్న తతంగం వెలుగుచూడంతో అందరూ ఉలిక్కిపడ్డారు. మున్సిపాలిటీలోని సిటిజన్ సర్వీస్ సెంటర్‌లో అవినీతి వెలుగు చూసింది. మున్సిపాలిటీల్లో సరిపడా ఉద్యోగులు లేకపోవడంతో అన్ని విభాగాలు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులపై ఆధారపడి నడుస్తున్నాయి. ఇందులో భాగంగానే సిటిజన్ సర్వీస్ సెంటర్ విభాగం ఓ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి చేతిలో నడుస్తోంది. సెంటర్ ఐడీని అధికారులు ఆమెకే అప్పగించారు. మున్సిపాలిటీలో వివిధ రకాల పనుల కోసం వచ్చే వారు తాము చెల్లించాల్సిన పన్నులు, ఇతర పనుల నగదు సెంటర్‌లోనే చెల్లిస్తారు. సర్వీస్ సెంటర్ ద్వారా మున్సిపల్ ఖాతాలో నెలకు దాదాపుగా రూ.5 లక్షల వరకు జమ అవుతాయి.

రూ.25 లక్షల కుంభకోణం.. రూ.19.5లక్షల రికవరీ

సర్వీస్ సెంటర్‌ల బాధ్యత పూర్తిగా మున్సిపాలిటీలో పనిచేసే మేనేజర్‌లదే.. మేనేజర్‌గా ఉన్న ఉద్యోగి రోజూ సర్వీస్ సెంటర్ ద్వారా కార్యాకలాపాలు ఏం జరిగాయి, ఎంత డబ్బు వచ్చింది వంటి పూర్తి వివరాలు చూసుకోవాలి. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు మిగతా ఉద్యోగులతో పోలిస్తే బాధ్యతలు తక్కువ కావడంతో వారిదే రాజ్యంగా కనిపిస్తోంది. మేడ్చల్ మున్సిపాలిటీలో సిటిజన్ సర్వీస్ సెంటర్‌లో గత మూడేళ్లుగా లెక్కలు అంతుచిక్కలేదు. ఆడిట్ అధికారులు నెల రోజులుగా ఆడిట్ చేసి రూ.25 లక్షల గోల్‌మాల్ జరిగినట్లు గుర్తించారు. సర్వీస్ సెంటర్‌ను నిర్వహించే అధికారులు మూడేళ్లలో రూ.25 లక్షలు మాయం చేసినట్లు గుర్తించి నివేదిక ఇవ్వడంతో మేనేజర్ శ్రీదేవి, గత మేనేజర్‌ల నుంచి రూ.13.5లక్షలు రికవరి అయ్యాయి. రూ.6 లక్షల డీడీలు, బ్యాంకుల ఖాతాల రూపంలో జమయ్యాయి. మరో రూ.4 నుంచి 5 లక్షలు మాయమైనట్లు అధికారులు గుర్తించారు. రోజూ సిటిజన్ సర్వీస్ సెంటర్‌కు వచ్చే ఆదాయంలో రోజూ రూ.10 వేలు మున్సిపల్ ఖాతాలో తక్కువగా జమ చేశారని, మూడేళ్లుగా ఈ తంతు నడవడంతో భారీ కుంభకోణం జరిగినట్లు ఆడిట్ అధికారులు గుర్తించడంతో అవినీతి వెలుగుచూసింది.

డబ్బుల ఆశలో పర్యవేక్షణ కరువు..

సర్వీస్ సెంటర్‌లో పేరుకు అవుట్ సోర్సింగ్ ఉద్యోగి పని చేస్తున్నా పెత్తనమంతా మేనేజర్‌దే.. నెపం అవుట్ సోర్సింగ్ ఉద్యోగిపై నెడుతున్నా పాత్ర అసలైన ఉద్యోగులదిగా కనిపిస్తోంది. ఆర్థిక వ్యవహారాలు పూర్తిగా చూసుకునే నైతిక బాధ్యత వారిదే అని తెలిసినా నిత్యం సెంటర్ ద్వారా ఎంత డబ్బు జమ చేస్తున్నారు. ఎంత వచ్చింది వంటి వివరాలను ఎందుకు పర్యవేక్షించడం లేదనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అవుట్ సోర్సింగ్, ప్రభుత్వ ఉద్యోగులు ఇద్దరు చేతులు కలపడం వల్లే మున్సిపల్ డబ్బులు హాంఫట్ అయ్యాయనే విషయం అందరికీ తెలిసినా ఎవరూ నోరు మెదపడం లేదు.

అంతా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులమయం

గత ప్రభుత్వం నూతన మున్సిపాలిటీలు ఏర్పాటు చేసి ఎన్నికలు నిర్వహించినా ఉద్యోగులను నియమించకపోవడంతో నగర శివారులోని అన్ని మున్సిపాలిటీల్లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులే అధికంగా పని చేస్తున్నారు. ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, అడ్మినిస్ట్రేషన్, విద్యుత్, శానిటరీ వంటి విభాగాల్లో అధికంగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులే ఎక్కువగా ఉన్నారు. బిల్ కలెక్టర్లు, ఎలక్ట్రిషన్లు సూపర్‌వైజర్లు ఇలా అందరూ తాత్కాలిక ఉద్యోగులే ఉన్నారు. తాత్కాలిక ఉద్యోగులకు నైతిక బాధ్యత తక్కువగా ఉండటం, ఎదైనా జరిగితే ఉద్యోగం మానేసి వెళ్లిపోయే వెసులుబాటు ఉండటంతో అవినీతికి ఆస్కారం ఎక్కువగా ఉంది. దీంతో వివిధ భాగాల్లో ప్రధానంగా టౌన్‌ప్లానింగ్, అడ్మినిస్ట్రేషన్, రెవెన్యూ, ఇంజినీరింగ్ విభాగాల్లో పనిచేసే తాత్కాలిక ఉద్యోగులు చెలరేగిపోతున్నారు. భవన నిర్మాణం నుంచి దుకాణాల లైసెన్స్‌ల వరకు ప్రతి పనికి ఒక రేటు నిర్ణయించి వసూలు చేసి అందులో తమ శాఖల అధికారులకు కొద్దోగొప్పో ముట్టచెబుతూ హాయిగా దందాలు నడిపిస్తున్నారు. ప్రజా ప్రతినిధులు సైతం వారికే పెద్దపీట వేస్తుండటం, వారికే అన్ని పనులు చెబుతుండటంతో అందరి అండతో చెలరేగిపోతున్నారు.

ఉద్యోగిపై ఫిర్యాదు చేశాం: కమిషనర్

మున్సిపాలిటీలో సిటిజన్ సర్వీస్ సెంటర్ ఉద్యోగి దివ్యపై మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని కమిషనర్ నాగిరెడ్డి తెలిపారు. క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరామని తెలిపారు. సిటిజన్ సర్వీస్ సెంటర్‌లో రూ.25లక్షల అవినీతి చోటుచేసుకుందనే విషయం తమ దృష్టికి వచ్చిందని అందులో రూ.13.5 లక్షలు రికవరీ అయ్యాయని, రూ.6 లక్షలకు రికార్డులు దొరికాయని రూ.4 నుంచి రూ.5 లక్షల వరకు మాయమైనట్లు తేలిందని చెప్పారు. అవినీతికి కారణమైన అవుట్ సోర్సింగ్ ఉద్యోగిపై చర్యలతో పాటు పాత్ర ఉందని తేలితే మేనేజర్లపై ఉన్నతాధికారుల ఆదేశాలతో చట్టపరంగా చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు.

ఎవరి పాత్ర ఎంత..?

మున్సిపాలిటీలో చోటు చేసుకున్న అవినీతి కుంభకోణంలో గతంలో పనిచేసిన ఉద్యోగులు, అధికారులు, ప్రజాప్రతినిధుల పాత్ర ఏమైనా ఉందా అనే కోణం కార్యాలయంలో ఆరా తీస్తున్నారు. ఎవరెవరి పాత్ర ఉంది. పరోక్షంగా ఎవరైనా అండగా ఉన్నారా వంటి విషయాలను లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగిపై కేసు నమోదు..

సిటిజన్ సర్వీస్ సెంటర్ నిర్వహిస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగి దివ్యపై మున్సిపల్ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. విచారణలో ఆమె వెల్లడించే విషయాలను బట్టి పూర్తి నివేదిక అందజేస్తామని సీఐ చెప్పారు.

నేడు అత్వెల్లి వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లి వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు. ఆలయ ఆవరణలో శనివారం సాయంత్రం 7 గంటలకు కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారి కల్యాణోత్సవంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

పోచారం: నారపల్లిలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు జరుగుతున్నందున శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ప్రదీప్ కుమార్ తెలిపారు. గణేషనగర్, బాబానగర్, మహాలక్ష్మీపురం, సురేందర్‌రెడ్డినగర్, సప్తగిరికాలనీ, దివ్యానగర్ రోడ్ ప్రాంతాలకు ఉదయం 8 నుంచి 8:30 వరకు, సప్తగిరికాలనీ-2, నారపల్లి వీకర్ సెక్షన్ కాలనీ, రేవతి రైస్ మిల్ ప్రాంతాలకు ఉదయం 8:30 నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఘట్‌కేసర్ పరిధిలో...

ఘట్‌కేసర్: మరమ్మతుల కారణంగా 11కేవీ కొండాపూర్ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 7 గంటల నుంచి 7.30 గంటల వరకు కొండాపూర్, ఫ్రైమ్‌లాండ్‌లో, 11 కేవీ బాలాజీనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 7.30 గంటల నుంచి 8 గంటల వరకు బాలాజీనగర్, గుంటిగూడెం, ఈడబ్ల్యూఎస్ కాలనీ, గాంధీనగర్ కాలనీలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ సతీశ్‌కుమార్ తెలిపారు.

మేడిపల్లి పరిధిలో...

మేడిపల్లి: మేడిపల్లి 11కేవీ మై విల్లాస్ ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 6.30 గంటల నుంచి 7గంటల వరకు మేడిపల్లి కొన్ని కాలనీల్లో సుమారు 30 నిముషాల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ అధికారులు తెలిపారు. కాకతీయ కాలనీ, ఓల్డ్‌విలేజ్, జెశ్రీరాంకాలనీ, జయశ్రీకాలనీ, అరవింద ఎన్‌క్లేవ్, మై విల్లాస్ కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తారని విద్యుత్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.



భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే



అన్నోజిగూడలోని క్రీస్తు జ్ఞాన మందిరంలో పాటలు పాడుతున్న బృందం

మేడ్చల్: ఏసుక్రీస్తును శిలువ వేసిన రోజైన గుడ్‌ఫ్రైడే సందర్భంగా మేడ్చల్‌లో శుక్రవారం క్రైస్తవులు ప్రార్థనలు నిర్వహించారు. ఏసు ప్రభువును శిలువ వేసిన రోజు కావడంతో శిలువను భుజాలపై మోస్తూ.. శిలువపై ఏసును కట్టేసిన వేషధారణలతో ప్రదర్శనలు నిర్వహించారు. పాటలు పాడుతూ ర్యాలీ కొనసాగింది. మేడ్చల్ మున్సిపాలిటిలో జాతీయ రహదారిపై ప్రదర్శనలు నిర్వహించారు. క్రైస్తవులు, మతపెద్దలు, పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

గుడ్ ఫ్రైడే ప్రత్యేక ప్రార్థనలు

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని క్రిస్టియన్ దేవాలయాల్లో గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. యేసుక్రీస్తుని సిలువ వేసిన రోజును గుడ్ ఫ్రైడే జరుపుకున్నారు. సిలువపై యేసు పలకిన మాటలపై వక్తలు ప్రసంగాలు చేశారు. ప్రభువు కరుణాకటాక్షాలు సర్వ మానవాళిపై కురవాలని కోరుకున్నారు.



మేడ్చల్‌లో శిలువ ఊరేగింపు

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న వజ్రేష్‌యాదవ్

బోడుప్పల్: రానున్న మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల్లో కార్యకర్తలు, నాయకులు గెలుపే లక్ష్యంగా పని చేయాలని మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్‌రెడ్డి గెలుపు కోసం అందరం కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించే దిశగా అడుగులు వేద్దామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బొమ్మక్ కళ్యాణ్‌కుమార్, రాసాల వెంకటేష్‌యాదవ్, తోటకూర అజయ్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శులు కొత్త ప్రభాకర్‌గౌడ్, విశ్వేశ్వర గుప్తా, నాయకులు బొమ్మక్ రమేష్, పులకండ్ల జంగారెడ్డి, కొత్త కిశోర్‌గౌడ్, వెంకటేశ్ గుప్తా, దాసగల్ల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు భంగం కలిగించడం సరికాదు

కాప్రా: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు నిబంధనల ప్రకారం కార్యక్రమాలు నిర్వహించుకోవాలని పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.గోపిరెడ్డి, రాచకొండ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు సీహెచ్.భద్రారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధి చెంగిచెర్లలో జరిగిన ఘటన నేపథ్యంలో కొందరు రాజకీయ నాయకులు పరామర్శల పేరుతో శాంతి భద్రతలకు భంగం కలిగిస్తున్నారన్నారు. గుంపులుగా వచ్చి విధి నిర్వహణలో ఉన్న పోలీసుల విధులకు ఆటంకం కలిగించడం, దురుసుగా ప్రవర్తించడం సరైంది కాదన్నారు. ఎన్నికల కోడ్ నిబంధనల ప్రకారం అనుమతి తీసుకొని, శాంతి భద్రతలకు భంగం కలగకుండా తమ కార్యక్రమాలు నిర్వహించుకోవాలని, అన్ని రాజకీయ పార్టీలకు వారు విజ్ఞప్తి చేశారు.

సన్‌రైజర్స్‌తో అరుణ్ ఐస్‌క్రీమ్స్

సాక్షి, సిటీబ్యూరో: వేసవి దక్షిణాదికి చెందిన ప్రముఖ బ్రాండ్ అరుణ్ ఐస్‌క్రీమ్స్ హైదరాబాద్ సన్‌రైజర్స్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ విషయాన్ని ఓ సమావేశంలో సంస్థ నగర ప్రతినిధులు తెలిపారు. ప్రస్తుత టీ 20 కప్ 2024 సీజన్ కోసం చేసుకున్న ఈ ఒప్పందం ద్వారా తెలుగు రాష్ట్రాల ప్రజలకు తాము మరింత చేరువ కాగలమని వీరు ఆశాభావం వ్యక్తం చేశారు. క్రికెట్ ప్రేమికులతో మరింత మమేకం కావడంతో పాటు నాణ్యమైన ఉత్పత్తులను అందించేందుకు వీలవుతుందన్నారు.

వెరైటీ థీమ్స్‌తో సోచ్ కలెక్షన్స్

సాక్షి, సిటీబ్యూరో: ఈవెనింగ్ అకేషన్ వేర్‌కు పేరొందిన సోచ్ బ్రాండ్, తమ తాజా స్ప్రింగ్ సమ్మర్ కలెక్షన్ 2024ను నగరంలో విడుదల చేసింది. కొత్త కలెక్షన్‌లో ఇండిగో హ్యూస్, షిఫ్లీ చిక్, కోటా కోచర్, ఐవరీ ఎలిగన్స్, బ్రీజీ థ్రెడ్స్ వివిడ్ బ్లూమ్స్ వంటి థీమ్‌ల మేళవింపు ఈ దుస్తుల శ్రేణి అని, చీరలు, చురీదార్ సెట్‌లు, డ్రెస్‌లు, కుర్తాలు, కఫ్తాన్‌లు లెహంగాలు అధునాతన హస్తకళల నీడిల్ వర్క్ నైపుణ్యానికి అద్దం పట్టేలా రూపొందాయన్నారు. నగరంలోని తమ షోరూమ్స్‌లో ఆన్‌లైన్‌లో ఈ కలెక్షన్ అందుబాటులో ఉంటుందన్నారు.

రంజాన్ మాసం ఉపవాస దీక్షలు

గౌతంనగర్: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని మల్కాజిగిరి నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లో రంజాన్ ఉపవాస దీక్షలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. మూడవ శుక్రవారం సందర్భంగా పలు మసీదులతో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.


ఖాసీం అలీకి డాక్టరేట్

రామంతాపూర్: నగరంలోని నవాబ్ షా అలం ఖాన్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీలో గణితం బోధించే రామంతాపూర్‌కు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ ఖాసీం అలీకి జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజీ యూనివర్సిటీ(జేఎన్‌టీయూహెచ్) గణిత శాస్త్రంలో డాక్టరేట్ ప్రకటించింది. ప్రొఫెసర్ డాక్టర్ వై.రాజశేఖర్‌రెడ్డి పర్యవేక్షణలో పరిశోధన పత్రాన్ని సమర్పించినందుకు జేఎన్‌టీయూ డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ ఇన్ మ్యాథమెటిక్స్ అవార్డును ఆయనకు శుక్రవారం అందజేశారు. పలువురు అధ్యాపకులు ఆయనను అభినందించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

అల్వాల్: తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగతనం జరిగిన ఘటన నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంతోషిమా కాలనీలో నివసించే ఆకర్ల భాస్కర్ ఈ నెల 23వ తేదీన అంబాజీపేటలోని బంధువుల గృహ ప్రవేశానికి కుటుంబ సమేతంగా ఇంటికి తాళం వేసి వెళ్లాడు. 29వ తేదీ రాత్రి ఇంటి తాళం పగలగొట్టి గుర్తు తెలియని దొంగలు వారి ఇంట్లోకి ప్రవేశించి ఇంట్లో ఉన్న నగలు, నగదు దొంగిలించారు. తాళం పగలగొట్టి ఉండటంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. బాధితుడు వస్తేగానీ దొంగతనం ఎంతమేరకు జరిగిందనేది తెలుస్తుందని పోలీసులు తెలిపారు.

మేడ్చల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చీదు హన్మంత్‌రెడ్డి



మేడ్చల్: మేడ్చల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చీదు హన్మంత్‌రెడ్డి ఎన్నికయ్యారు. న్యాయస్థానం ఆవరణలో జరిగిన ఎన్నికల్లో హన్మంత్‌రెడ్డి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా లింగారెడ్డి, జాయింట్ సెక్రటరీగా మదన్‌మోహన్, కోశాధికారిగా హనుమంతు, లైబ్రేరియన్‌గా రహీం, కల్చరల్ కార్యదర్శిగా జియాద్దిన్‌తోసిఫ్, న్యాయప్రతినిధిగా వాణి కార్యవర్గ సభ్యులుగా సంయుక్త, మహేందర్, అభిషేక్, మురళీధర్‌రెడ్డి, ఉపేందర్ ఎన్నికయ్యారు. ఎన్నికలను ఎన్నికల అధికారి రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు.



బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

మల్కాజిగిరి సీటును సీఎంకు కానుకగా ఇస్తాం..

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత బోనగిరి సురేష్‌యాదవ్ నివాసంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో మల్కాజిగిరి పార్లమెంట్ కో-ఆర్డినేటర్ మైనంపల్లి హన్మంతరావు ఆదేశాల మేరకు మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి సునీతమహేందర్‌రెడ్డి గెలుపునకు కృషి చేస్తామని, మల్కాజిగిరి సీటు గెలిచి సీఎం రేవంత్‌రెడ్డికి కానుకగా ఇస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోదీని గుండెల్లో పెట్టుకున్న మల్కాజిగిరి

మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్



సమావేశంలో నేతలు



మాట్లాడుతున్న మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని లక్ష్మీ సాయి గార్డెన్‌లో శుక్రవారం బీజేపీ మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ హాజరై మాట్లాడుతూ.. ప్రపంచ దేశాలు మళ్లీ నరేంద్రమోదీ ప్రధాని అవుతారని నమ్ముతున్నారన్నారు. దేశంలో సుస్థిర, సుసంపన్న, శాంతియుత పాలన కావాలంటే నరేంద్రమోదీకి ఓటు వేయాలన్నారు. నరేంద్రమోదీ గుండెల్లో పెట్టుకున్న నియోజకవర్గం మల్కాజిగిరి అని, ప్రజల అండతోనే మల్కాజిగిరిలో ప్రధాని నరేంద్రమోదీ రోడ్‌షో విజయవంతం అయ్యిందన్నారు. కిలోమీటర్ల మేర రోడ్డుకి ఇరువైపులా ఆయనకు ఘన స్వాగతం పలికారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఊసరవెల్లిలా మాట్లాడుతున్నారని, రాష్ట్రానికి వచ్చిన ప్రధాని మోదీని మొదటిసారి మా పెద్దన్న అన్నారని, తర్వాత ఆయనే మోడీ గీడీ అని ఊసరవెల్లిలా మాట్లాడుతున్నారన్నారు. కేసీఆర్‌ను ఓడించడానికి ప్రజలు రేవంత్‌రెడ్డికి అధికారం ఇచ్చారన్నారు. ప్రధాని మోదీని విమర్శించిన వారు ఏమైపోయారో చూశామని, రేవంత్‌రెడ్డికి అదే గతి పడుతుందన్నారు. అదేవిధంగా బీఆర్‌ఎస్‌లో సీట్లు ఇస్తా అంటే వద్దు అని పారిపోతున్నారని, బీఆర్‌ఎస్‌లో పోటీ చేయడానికి దిక్కులేదన్నారు. తెలంగాణ ఉద్యమకారులారా తెలంగాణ అభివృద్ధి కోసం, దేశాభివృద్ధికి బీజేపీకి ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, నాయకులు ఆర్కే శ్రీనివాస్, అసెంబ్లీ కన్వీనర్ వెంకటేష్, గోలీ మధుసూదన్‌రెడ్డి, వీకే.మహేష్, వేణుగోపాల్ రెడ్డి, కార్పొరేటర్లు శ్రావణ్, సునీత, నాయకులు టీమ్ సాయి, భానుప్రకాష్, గిరివర్ధన్‌రెడ్డి, శ్రీనావాస్, ప్రసన్న, శ్రీనివాస్, నర్సింహగౌడ్, సుబ్బారావు, రామకృష్ణ, జగదీష్, గణేష్, లక్ష్మణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.